
# హస్తామలక స్తోత్రము–3

శ్లో॥ నిమిత్తం మనశ్చక్షురాది ప్రవృత్తౌ
నిరస్తాఖిలోపాధి రాకాశకల్పః।
రవిర్లోక చేష్టానిమిత్తం యథా యః
స నిత్యోపలబ్ధి స్వరూపోఽహ మాత్మా॥

తా॥ "ఉపాధిరహితమైనదియు, ఆకాశమువలె సర్వవ్యాపకమైనదియు, సూర్యుడు లోకవ్యవహారమునకు సాక్షిమాత్రుడై యుండునట్లు నేత్రాదీంద్రియములయొక్కయు, మనస్సుయొక్కయు ప్రవృత్తులకు సాక్షియై యుండునదియు, వాటి చర్యలకు నిమిత్తమాత్రమై యుండునదియు, ఎల్లపుడు పొందబడియే యున్నదియునగు ఆత్మస్వరూపమే నేను".

వ్యాఖ్య :–సూర్యోదయము కాగానే జనులు వారి వారి పనులలో ప్రవేశించుదురు. కాని 'మీరు మీమీ పనులు చేసికొనుడు' అని సూర్యుడు ఎన్నడును ఆదేశింపడు. అతడు జనుల క్రియాకలాపములకు కేవలము నిమిత్తమాత్రుడు. అతని సాన్నిధ్యమహిమచే అన్ని కార్యములు జరిగిపోవుచుండును. అట్లే ఇంద్రియ మనంబుల చర్యలకు ఆత్మ నిమిత్తమాత్రుడు. సాక్షిభూతుడు. 'అట్టి నిత్యోపలబ్ధుడగు చిద్రూప ఆత్మయే నేను'– అని హస్తామలకునివలె ప్రతివారును అనుభూతిమొనర్చుకొనవలెను.

ఓం




సంపుటము : 25 జనవరి 1993 సంచిక 1

## సంపాదకవర్గము

గౌరవ సంపాదకులు :

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి M.A.,D.Litt. శ్రీ సముద్రాల లక్ష్మణయ్య M. A.

సంపాదకులు : బి. ఈశ్వర్

సహాయ సంపాదకులు : బోధచైతన్య,M.A. ఓంప్రకాశ్ B.Sc.

సంవత్సర చందా : రూ. 30/-లు

పంపవలసిన అడ్రసు : మేనేజరు, వేదాంతభేరి కార్యాలయము
అనిల్ బిల్డింగ్స్, సూర్యారావుపేట
పి.బి.నెం.323, విజయవాడ-520 002
ఫోన్స్ : 61862, 64017, 72433
Telex : 0475 362 ANIL Fax : 0866-63017

శాశ్వత చందా : రూ. 300/-లు.

పంపవలసిన అడ్రసు : 'వేదాంతభేరి శాశ్వతనిధి'
శ్రీ శుకబ్రహ్మాశ్రమము, శ్రీ శుకబ్రహ్మాశ్రమము
పోస్టు, శ్రీకాళహస్తి-517 640
ఫోన్స్: 2239,2543 STD Code 085 78

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరములలో తమ చందా నంబరు తప్పక ఉదహరించవలెను. చందా నంబరు మీకు పోస్టులో వచ్చు 'వేదాంతభేరి' కవరుపైయుండును.



**అనుష్ఠాన వేదాంతమును బోధించు ఆధ్యాత్మిక మాసపత్రిక**

**BE FEARLESS : నిర్భయులై యుండుడు!**

విషయసూచిక



: ముఖచిత్రము :

హరివరాసనం విశ్వమోహనం

హరిహరాత్మజం దేవమాశ్రయే।

శరణమయ్యప్పా! స్వామి శరణమయ్యప్పా!

చలల్లోల కల్లోల కల్లోలినీశ

స్ఫురన్నక్ర చక్రాది వక్త్రాన్ముఖ్బలీనః

హతో యేన మీనావతారేణ శంఖః

స పాయాదపాయాజ్జగద్వాసుదేవః.

మత్స్యావతారమునెత్తి మహాసముద్రములోపల మకరాది భయంకర జలజంతువుల మధ్య నివసించు రాక్షసుని వధించినట్టి పరమాత్మయగు వాసుదేవుడు ఈ ప్రపంచమును ఆపదలనుండి రక్షించుగాక! అట్టి మత్స్యావతారమూర్తియగు పరమాత్మకు నమస్కారము.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

1993వ నూతన సంవత్సరము ప్రవేశించినది. ఈ శుభసందర్భమున వేదాంతభేరి పాఠకులందరికిని మా శుభాకాంక్షలను తెలియజేయుచున్నాము.

1. Worship God
2. Be Good
3. Do Good

అనగా— 1. భగవంతుని ధ్యానింపుడు

2. మంచిగ యుండుడు.

3. మంచిని చేయుడు.

అను ఈ మూడు సూత్రములను పర్వ్యులును సదా జ్ఞప్తియందుంచుకొని వాటిని కార్యాన్వితమొనర్చ్యుచు భగవదనుగ్రహముచే పరమశాంతిని, సుఖమును అనుభవింతురుగాక!

—సంపాదకుడు




On you lie the future hopes of our country. I feel extreme pain to see you leading a life of inaction. Set yourselves to work to work! Do not tarry- the time of death is approaching day by day! Do not sit idle, thinking that everything will be done in time later!

మీపై మీ దేశ భవిష్యత్తు ఆధారపడియున్నది. మీలో కొందఱు అకర్మణ్యులై, బద్ధకముగ జీవితమును గడుపుట నాకు బాధాకరముగనున్నది. కర్మ రంగమున దుముకుడు! ఆలసింపకుడు. రోజు రోజుకు మృత్యుసమయము ఆసన్నమగుచున్నది. తరువాత చేయుదుములే అని తలంచి-సోమరులుగ నుండకుడు. ○○

వేదాంతభేరి

## శ్రీ విద్యాప్రకాశానందగిరి [illegible]



1. జీవుని దేవుని యొద్దకు చేర్చునదియే ... మతము
2. మానవుని మాధవునిగ పరిణామింప జేయునదియే... మతము
3. మనస్సును శుద్ధమొనర్చి మతిని(బుద్ధిని) బాగుచేయునదియే... మతము
4. ప్రేమ, కరుణ, దయ, పరోపకారము మొదలగు ఉదాత్తగుణములను బోధించునదియే ... మతము
5. భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రబోధించునదియే... మతము
6. కోట్లకొలది జన్మలు అజ్ఞాన గాఢాంధకారమునపడి జనన మరణాది నానా బాధలకు లోనైన జీవునకు జన్మరాహిత్యమునకు మార్గమును చూపునదియే... మతము
7. హింసను నిర్మూలించునదియే... మతము
8. అహింసను ప్రోత్సహించునదియే... మతము.

మనుజుడు ఏ మతమునకు చెందినవాడైనప్పటికిని ఆ మతము నందలి ధర్మసూత్రములను చక్కగ అనుష్ఠించుచు క్రమక్రమముగ దైవాను

భూతిని బడయవలెను. అన్ని మతముల యొక్క లక్ష్యము ఇదియే. ఈ సందర్భమున శ్రీ వివేకానందులు పలికిన గంభీరవచనములు ఉల్లేఖింప దగియున్నవి—

*1. Religion is realising. Before that it is the spelling of the word and no more.*

*2. Man must realise God, feel God, see God, talk to God and that is religion.*

1. [illegible] దైవసంబంధమైన అనుభూతిని పొందుటయే. అది పొందనంతవరకు మతమనునది [illegible] —అను మూడు అక్షరముల యొక్క కూడిక మాత్రమే యగును. మరేమియును కాదు.

2. మనుజుడు దైవసంబంధమైన అనుభూతిని పొందవలెను. దైవమును హృదయస్థము చేసుకొనవలెను. దేవుని చూడవలెను. దేవునితో మాట్లాడ వలెను— అదియే మతము.

దేశకాలములను బట్టియు, మతప్రవక్తల యొక్క ప్రబోధములను బట్టియు మతములు వేర్వేరుగ యుండవచ్చును. కాని అన్ని మతముల యొక్క గమ్యము ఒకటియే. లక్ష్యము ఒకటియే. భగవత్ప్రాప్తియే ఆ లక్ష్యము. మతములలో అనేక సంప్రదాయములు ఆచారములు యుండ వచ్చును. కాని అన్నిటి యొక్క మూలసూత్రములు ఒకటియే.

ప్రేమను, దయను, కరుణను, పరోపకారమును అన్ని మతములు ప్రోత్సహించును. వైరమును, ద్వేషమును, అపకారమును అన్నిమతములు గర్హించును. మార్గములు వేరైనను గమ్యము ఒకటియే కాబట్టి వారివారికి అనుకూలములైన మార్గములను చేబట్టి అందరును గమ్యమగు భగవంతుని చేరవచ్చును.

'మా మార్గమే గొప్పది', 'కాదు కాదు మా మార్గమే గొప్పది'—అని పరస్పరము కలహించుకొనుట యుక్తము కాదు. పర్వతశిఖరమును చేరుటకు అనేక మార్గములు యుండవచ్చుగదా! కాబట్టి జనులు మతసామరస్యము కలిగి ప్రవర్తించుచు పరస్పరము ప్రేమ భావము కలిగి తమ ఉన్నతి కొరకు

ప్రయత్నించుచు ఇతరుల ఉన్నతికి సహాయమొనర్చుచుయుండవలెను. ప్రపంచ శాంతికి, దేశాభ్యుదయమునకు ఇదియే మార్గము.

నదులు అనేక మార్గముల ద్వారా ప్రవహించుచు తుట్టతుదకు అన్నియు సముద్రమను ఒకే లక్ష్యమును చేరుచున్నవి. సముద్రమును చేరిన పిదప అన్ని నదులున్ను ఒకటిగానే యుండును.

అట్లే వివిధ మతములున్ను జీవుని దేవుని యొద్దకు చేర్చివేయును. అచట ఇక జీవుల భేదముగాని, మతముల భేదముగాని ఇక ఏ మాత్రము యుండదు.

ఈ రహస్యమును తెలుసుకొనినచో ఇక ఒక మతమువారు మరియొక మతమువారిని ద్వేషించుటకు అవకాశమే యుండదు. మతసామరస్యమును గూర్చి ఈ క్రింది శ్లోకము చక్కగా విశదీకరించుచున్నది.

[illegible] నైయాయికాః
కర్మేతి మీమాంసకాః
[illegible] జైనశాసనరతాః
[illegible]
సోఽయం వో విదధాతు వాంఛితఫలం
త్రైలోక్యనాథో విభుః

శైవులు 'శివుడని' యు, వేదాంతులు 'బ్రహ్మమని 'యు, బౌద్ధులు 'బుద్ధుడని' యు, మీమాంసకులు 'కర్మ' యనియు, జైనులు 'అర్హత్' అనియు, నైయాయికులు 'కర్త' అనియు భావించి ఎవరిని ఉపాసించుచున్నారో అట్టి త్రైలోక్యనాథుడగు ప్రభువు, భగవంతుడు మీకు వాంఛిత ఫలముల నొసంగుగాక!

పై శ్లోకమందు అన్ని మతముల యొక్క గమ్యము ఒక్కటే అని నిరూపింపబడినది. కేరళ రాష్ట్రమునందు [illegible] అను మహాత్ముడు అవతరించి అందరి జనులకు ఒకే దైవమనియు, దేవుళ్ళలో భేదమేమియు లేదనియు నొక్కి వక్కాణించెను. [illegible] చెందినవారైనను [illegible] కాబట్టి [illegible] ప్రోత్సహించవలెను. [illegible] వ్యాప్తి నొందించవలెను. [illegible] విస్తరింపజేయవలెను.

శ్రీ మహర్షి మలయాళస్వాములవారు ఈ క్రింది వాక్యములను భక్తులచే ఉచ్ఛరింపజేయుచుందురు.

[illegible] ప్రతిష్ఠితమగును గాక!

కరుణామతము వృద్ధినొందును గాక!

శాంతిమతము స్థాపితమగును గాక!

సత్యమతము స్థిరప్రతిష్ఠ నొందును గాక!

ధర్మమతము ఉద్ధరింపబడును గాక!

ఋషిమతము వర్ధిల్లును గాక!

స్వాతంత్ర్యమతము జయించును గాక!

జ్ఞానమతము వ్యాపకమగును గాక!

జనులు వారి వారి మతములను చక్కగ అనుసరించుకొనుచు భగవంతుని యెడల అనన్యభక్తి గలవారై అధ్యాత్మిక మార్గమున పురోగమించుచు, భేదములను విస్మరించి, వైరభావమును విడనాడి, అభ్యుదయ పథమున జనుచు జీవితమును శాంతిమయముగ, భక్తిమయముగ, ప్రేమమయముగ ఒనర్చుకొనవలెను.

తమ హృదయములందు విద్వేషమునకు ఏ మాత్రము చోటీయరాదు. ఇట్టి మతసామరస్యము వలననే లోకములో శాంతి సౌభాగ్యములు విలసిల్లగలవు. జీవితము ఆనందమయముగ శోభించగలదు.

ఒక భక్తుడు ఈ క్రింది విధముగ భగవంతుని ప్రార్థించి సర్వమత సామరస్యమును లోకమునకు చక్కగ చాటెను.

*Oh Lord! Grant me,*
*The heart of [illegible]*
[illegible]
*The brain of Shankara,*
*The body of Mohammed,*
*The purity of Joraster,*
*The Forgiveness of Jesus Christ*
*The fearlessness of Vivekanand*
*The divine experience of Ramathirtha and*
*The non-violence of Mahatma Gandhi.*

[illegible]
[illegible]
[illegible]
జొరాష్టరు యొక్క పవిత్రత,
క్రీస్తు యొక్క క్షమాశీలత్వము,
వివేకానందస్వామి వారి నిర్భయత్వము,
రామతీర్థస్వామి వారి ప్రగాఢ బ్రహ్మానుభవము,
గాంధీమహాత్ముని యొక్క అహింసాతత్త్వము,
నాకు అనుగ్రహింపుడు!

అన్ని మతముల యొక్క లక్ష్యము ఒక్క భగవంతుడే కావున ఆ భగవంతుని చేరుటకై జనులు వారి వారి మతానుసారము ఆచరించుచు ధర్మప్రవర్తన గలవారై హృదయశుద్ధిని బడసి, పరప్రాణులను తనవలె చూచుకొనుచు పరోపకారపరాయణులై అన్యోన్య ప్రేమానురాగయుతులై ద్వేషమునకు, వైరమునకు స్వస్తిచెప్పి దైవానుభూతిచే పరమానందమును, పరమశాంతిని అనుభవించవలెను. ○○

## శ్రీ మాదిరాజు మురళీకృష్ణ గారు (న్యూఢిల్లీ)

"దేవుడు వున్నాడా?" అని ఎవరైనా
అడిగితే-
ముందు 'నీవు వున్నావా?' అని నేను
అడుగుతాను.

అవును నేను వున్నాను.

నిద్రలోనూ వున్నాను, మెలకువలోను
వున్నాను.
ఇది ఎవ్వరైనా చెప్పే సత్యం.
కనుక వున్నది 'నేనే'.
ఆ 'నేనే' అనేక 'నేను'లై దృశ్య
ప్రపంచమైంది.
దృశ్యజగత్తు వెనుక వున్న నేనే,
మూలంగా వున్న నేను.

ఆ 'నేనే' అఖండము.
అద్వితీయము.
ఆ 'నేనే' నీవు వెదికే దేవుడు
ఉన్నది కేవలం
అఖండమైన నేను.
రెండవదిగా విడగొట్టి చూడబోకు.
అదే అన్ని అనర్థాలకు మూలం
ఆ 'నేనే' 'నాది'గా మారినప్పుడు
ఖండ ఖండాలుగా మారింది.
కనుక మూలంలో వున్న 'నేను'ను
అనుభవించు
అప్పుడు 'దేవుడున్నాడా?' అని అడుగవు.
అవసరంలేదు
ఉన్న 'నేను' తప్ప, మిగిలిందంతా ఆభాస
మాత్రమే.

నేను చూసేదంతా నా కల్పనా
ఇంద్ర జాలం.
నేను వచ్చినప్పుడు ఒంటరినే.
పోయేటప్పుడూ ఒంటరినే.

మధ్య వచ్చిన కాల్పనిక జగత్తునుంచి,
దాని వెనుకవున్న నన్ను వడగొట్టి,
విడగొట్టి, నన్ను నేను తెలుసుకోవాలి.
అదే ప్రతి వ్యక్తి వెదికే దేవుడు.
కనుక దేవుడెక్కడని వెదికే ఓ నరుడా!

నీలో వున్న ఆత్మను తెలుసుకో.
తెలుసుకొని వెదికి పట్టుకో.
ఆ పట్టుచిక్కితే నీవు ఇతరులకన్నా
అధికుడవనీ లేక తక్కువనీ, వుండే భ్రమల
నుంచి దూరమౌతావు.
గురువు నీవైతే శిష్యుడివి కూడా నీవే
అధికారివి నీవైతే బంటువి కూడా నీవే
సేవచేసేవాడివి, చేయించుకునేవాడివి,
నీవే.

నీవు సర్వస్వతంత్రుడవు.

రెండవ వస్తువు నీ ఆభాస, కల్పన.
నీవు కేవలం ఒంటరివి మాత్రమే.
కనుక నీలోవున్న ఆత్మను వెదుకు.
వెదికి పట్టుకో.

దానితో వున్న ఆభాస అంతమౌతుంది.
ఉన్న సత్యం గోచరిస్తుంది.
ఆ యున్న 'నేను' ఎప్పుడూ ఒక్కటే.
ఇదే అద్వైతం.

OO

# ధర్మం శరణం గచ్ఛామి

## శ్రీ బోధచైతన్య గారు

ఒక సమయంలో మగధదేశంలోని రాజగృహ నగరంలో భయంకరమైన అంటువ్యాధి సోకింది. ఆ నగరంలోని కోటీశ్వరుడైన ఒక వర్తకునికి, ఆయన భార్యకు కూడా ఆ వ్యాధి సోకింది. వాళ్ళిద్దరూ తమ ఏకైక కుమారుడు పన్నెండేండ్ల కుంభ ఘోషకుణ్ణి తక్షణమే ఆ ఊరు వదలి దూరంగా ఎక్కడికైనా వెళ్ళిపొమ్మన్నారు. తాము దాచి వుంచిన 40 కోట్ల వరహాలు ఎక్కడున్నాయో గుర్తులు చెప్పి తగిన సమయంలో వచ్చి ఆ ధనాన్ని స్వాధీనం చేసుకోవలసిందిగా కూడా చెప్పారు.

కుంభఘోషకుడు 12 ఏండ్లపాటు వింధ్య పర్వత ప్రాంతాల్లో గడిపి ఆ పిమ్మట రాజగృహానికి మరలినాడు. తలిదండ్రులు చెప్పిన గుర్తుల ప్రకారం 40 కోట్ల ధనరాశిని కనుక్కొన్నాడు. కానీ దాన్ని వెంటనే తీసుకోవడానికి ఆత్రపడలేదు. అంత ధనాన్ని ఒక్కసారిగా బైటకు లాగితే దాన్ని రక్షించుకోవడం ప్రాణాంతకంగా వుంటుంది. ఆ ధనంతో ఏ దేశం వెళ్ళినా "దిక్కూ దివాణం లేనివాడికి ఇంత ధనం ఎక్కడిది?!" అని ఆ దేశం రాజు నిశ్చయంగా పెరుక్కోవడమే గాక దండించే అపాయం కూడా వుంది. కనుక స్వంత ఊరిలోనే వుండి మెల్లగా సమయం వచ్చినప్పుడు అది పిత్రార్జితమని నిరూపించి మరీ దాన్ని బైటకు తీయాలని నిర్ణయించాడు.

కొన్నాళ్ళకు ఆ ఊరి పురపాలక సంఘంలో ఒక చిన్ననౌకరీ సంపాయించి కార్మికవాడలో ఒక చిన్న బస కూడా ఏర్పాటు చేసుకొన్నాడు. ఆయా సమయాల్లో వీధి వీధి తిరిగి దండోరా వేసి రాజశాసనాలను, ప్రకటనలను వినిపించడం అతనికి పనిగా ఇచ్చారు.

ఒకనాడు ఇతడు దండోరా వేసి వినిపిస్తుండగా ఆ దేశం రాజైన బింబిసారుడు వినడం జరిగింది. బింబిసారుడు మహా కుశాగ్రబుద్ధి. "ఆ కంఠం వున్నవాడు దండోరా వేసే నౌకరుగా నేను నమ్మడం లేదు. ఆ కంఠం కోటీశ్వరుడి కంఠం" అన్నాడు. ఈ

మాటలు విన్న రాజపరిచారిక వెంటనే కుంభఘోషుని సమాచారం సేకరించి రాజుకు విన్నవించింది. "అతడు చిల్లిగవ్వ కూడా లేని ఒక పరదేశి దరిద్రుడు. ఈ ఊరికి కొత్తగా వచ్చి దండోరా ఉద్యోగం సంపాయించి పొట్ట పోసుకుంటున్నవాడు. నివాసం కార్మికవాడలో ఒక చిన్న గుడిసె" రాజు నమ్మలేదు.

"అతను కోటీశ్వరుడని నా ఆరవ ఇంద్రియం నొక్కి చెబుతూ వుంది" అన్నాడు. రాజపరిచారిక ఈసారి తానే స్వయంగా ఆరా తీయాలని నిశ్చయించింది.

రాజగృహానికి సమీపంలోని వేలువనంలో వున్న బుద్ధదేవుణ్ణి సందర్శించు కోవడానికి సుదూరం నుండి వచ్చిన ఒక యాత్రికురాలుగా నటన చేసి కుంభఘోష కుని ఇంటిలో కొన్నాళ్ళు ఆశ్రయాన్ని సంపాయించింది. ఆమె ఎంత శోధించి చూచినా అతను ఒక దరిద్రుడనే తేలుతూ వుంది. చివరకు ఆమెకు ఒక ఉపాయం తట్టింది. ఆ ఉపాయాన్ని రాజుకు చెప్పి అమలులో పెట్టించింది.

"విశ్వకర్మ పూజ కోసం కార్మికవాడ కుటుంబాలన్నీ తమ తమ వంతుగా ఒక్కొక్క వరహా చందాగా ఇచ్చుకోవా"లని రాజుగారి దండోరా మరునాడు వింతగా ఆ వాడలో వినపడింది. కుంభఘోషకుని దగ్గర వరహా లేదు. రహస్యంగా వున్న ధనం నుండి ఒక వరహా తెచ్చి తన వంతు చందాగా చెల్లించాడు. అతనిచ్చిన వరహా మాత్రం ఇతర వరహాలతో కలిసిపోకుండా పరిశీలనకై రాజుగారి చేతికి పోయింది.

కుంభఘోషకుణ్ణి రాజుగారు తన సముఖానికి పిలిపించి ఏకాంతంలో అతనికి బాగా నమ్మకం పుట్టించి అసలు విషయాన్ని రాబట్టాడు. ఆ 40 కోట్ల వరహాలను తన కోశాగారానికి చేర్పించాడు. కుంభఘోషకుణ్ణి కోశాధికారిగా నియమించడమే గాక తన కుమార్తెనిచ్చి వివాహం కూడా చేశాడు.


ఒకనాడు అల్లుణ్ణి వెంటబెట్టుకొని బింబిసారుడు తథాగతుని దర్శనానికోసం వేలువనానికి వెళ్ళాడు. అల్లుణ్ణి పరిచయం చేస్తూ అతడు కోటీశ్వరుడై వుండి కూడా చాటింపువేసే నౌకరుగా ఎలావుండినాడో చివరకు ఎలా తన అల్లుడయ్యాడో మొదలగు విషయాలన్నీ చెప్పాడు. ఆ సందర్భంగా బుద్ధుడు క్రింది శ్లోకాన్ని పఠించాడు.

**ఉత్థానవతః స్మృతిమతః శుచికర్మణో నిశమ్యకారిణః**
**సంయతస్య చ ధర్మజీవినోఽ ప్రమత్తస్య యశోఽభివర్ధతే** –ధర్మపదం 2-4

ప్రయత్నశీలుడు, స్మృతిమంతుడు, మనోవాక్కాయకర్మలలో శుద్ధి కలిగిన వాడు, పూర్వాపరములు చక్కగా విచారించి పనులు చేయువాడు, ఇంద్రియములను వశమునందుంచుకొన్నవాడు, ధర్మబద్ధముగా జీవికను నడిపించువాడు, అజాగ్రత్త లేనివాడు అయినవాని యొక్క కీర్తి, సంపద క్రమముగా వృద్ధి చెందుచుండును.

○○

# నామసంకీర్తన



1. దశరథనందన సీతారామ్ । దానవసంహర సీతారామ్
భక్తవత్సల సీతారామ్ । వారిధిబంధన సీతారామ్
అనాథరక్షక సీతారామ్ । అహల్యావరద సీతారామ్
జయ జయ రాం జానకిరాం । జయ రఘునందన సీతారామ్॥

2. జయ జయ సీతారాం జయ జయ రఘురాం
జయ జయ జానకిరాం జయ జయ కల్యాణరాం
జయ జయ భద్రాద్రిరాం జయ జయ సీతారాం
జయ జయ కోదండరాం జయ జయ కారుణ్యారాం
జయ జయ పట్టాభిరాం జయ జయ పావనరామ్॥

3. దశరథనందన దాసోహం । దశముఖ మర్దన దాసోహం
దాసోహం తవ దాసోహం । దాసోహం తవ దాసోహం
తాపసశరణా దాసోహం । తామరసేక్షణ దాసోహం
ధరణీభరణా దాసోహం । తాపత్రయహర దాసోహం
దైవగుణాకర దాసోహం । తారకనామా దాసోహం
దాసజనావన దాసోహం । త్యాగపరాక్రమ దాసోహం
తత్త్వస్వరూప దాసోహం । ధర్మగుణాకర దాసోహం
దాన శ్రీహర దాసోహం । తాపజ్వరహర దాసోహం
దారిద్ర్యహరణా దాసోహం । దశవిధరూపా దాసోహం
ధరణిజనాథా దాసోహం । తారకనిలయా దాసోహం
తవ దాసోహం, తవ దాసోహం । దాసోహం తవ దాసోహమ్.

4. రామస్మరణా దన్యోపాయం । నహి పశ్యామో భవతరణే।
రామహరే కృష్ణహరే । తవ నామ వదామి సదా నృహరే। ○○

# రామాయణ సుధ

## సుందరకాండయందలి ఒక చక్కటి పద్యం

[illegible]

తృతీయం బప్పురి

నుంచి ద్వితీయంబు దాటి [illegible] నృపు గాంచెన్

రామాయణమునందలి సుందరకాండయందు గల భావగర్భితమైన ఒకానొక పద్యమది. ఈ పద్యములో పంచమహా భూతముల యొక్క ప్రస్తావన గావించబడినది. ఈ పద్యము యొక్క భావమేమనగా- హనుమంతుడు ఆకాశమార్గముగుండ లంకను జేరి సీతను గాంచి, తదుపరి ఆ లంకా పట్టణమును తగులబెట్టి తిరిగి సముద్రమును దాటి శ్రీరామచంద్రుని యొద్దకు వచ్చెను.

పంచమహాభూతములనగా 1) పృథివి, 2) జలము, 3) అగ్ని, 4) వాయువు, 5) ఆకాశము.


చతుర్థ జాతుడు- చతుర్థమనగా నాల్గవది. పంచ మహాభూతములలో నాల్గవది వాయువు. చతుర్థ జాతుడనగా వాయుపుత్రుడగు హనుమంతుడు అని అర్థము.


పంచమమార్గము- పంచమమనగా ఐదవది. పంచ మహాభూతములలో ఐదవది ఆకాశము. 'పంచమ మార్గమున నేగి' యనగా 'ఆకాశమార్గముగుండ వెడలి' అని అర్థము.

ప్రథమ తనూజ- ప్రథమమనగా పంచమహా భూతములలో మొదటిదగు భూమి. "ప్రథమ తనూజన్‌గాంచి" యనగా 'భూసుత యగు సీతాదేవిని చూచి" అని అర్థము. తృతీయం బప్పురి నుంచి- తృతీయమనగా మూడవ పంచ మహాభూతమైన అగ్ని. 'తృతీయం బప్పురి నుంచి' యనగా 'అగ్నిచే లంకాపురిని తగులబెట్టి' అని అర్థము. "ద్వితీయంబు దాటి-" ద్వితీయమనగా రెండవ పంచ మహాభూతమగు జలము. 'ద్వితీయమును దాటి' యనగా 'సముద్రమును దాటి' అని అర్థము.

"నృపు గాంచెనో- యనగా 'శ్రీరామచంద్రుని దర్శించెను' అని అర్థము.

○○





## శ్రీమతి కె. భార్గవి గారు M.Sc., (అనంతపురం)

'సిట్రస్' ఫలముకంటె ఇదేదో క్రొత్తగా వుందే అనుకునేరు. నిత్యజీవితంలో మనము చూచేవే, వాడేవే. సిట్రస్ జాతి ఫలములన్ని 'రూటేసి' అను కుటుంబము లోనివే. ఇవేకాక వెలగ, అతిశ్రేష్ఠమైన బిల్వ కమ్మదనాన్ని కలిగించే కరివేపాకు కూడ ఈ కుటుంబములోనివే. ఇంతకీ సిట్రస్ ఫలములంటె ఏవో చెప్పబడలేదు. నిమ్మ, చీనీ, కమలాలు, కిచిరీ, నారింజ మున్నగునవి. వీటన్నిటిలో విటమిన్ 'సి' అధికము. ఇంతేకాక విటమిన్ 'పి' కూడ వుండి 'సి' విటమిన్ ఉత్పత్తికి తోడ్పడును. వృక్షశాస్త్ర పరంగా ఈ ఫలములను 'హెస్పరీడియమ్' అని వర్ణింతురు. దీనిలో రసభరితమైన కేశములు వుండును. వీటినే మనము భుజింతుము.

వీనిలో మనము ప్రస్తుతము నిమ్మకాయ విశిష్టతను గూర్చి పరిశీలిద్దాము. నిమ్మఫలము చల్లదనానికి మారు పేరు. పండినప్పుడు పసుపు పచ్చని రంగులో కనుల పండువగా వుండును. పెద్ద నిమ్మకాయ పరిమాణములో వున్నదానికి శరీర పుష్టిని చేకూర్చే ఇనుము 0.006 గ్రాములు, సున్నము 0.024 గ్రాములు, భాస్వరం 0.022 గ్రాములు, పొటాషియమ్ 0.0442 గ్రాములు, శక్తి 34 కేలరీలు కలవు. పోషక విలువలేకాక ఇది ఆహారానికి ఒక రకమైన సువాసన, రుచిని ఒసగును. నిమ్మ రసంతో చేసిన పులిహోర మీకు తెలిసినదే.

ఔషధ గుణాన్ని పరికించిన 'సి' విటమిన్ ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ రాకుండా కాపాడును. అన్ని రకముల వైరస్‌లను నశింపచేయును. పళ్ల జబ్బులకు, చిగుళ్ళ నుండి స్రవించు రక్తాన్ని అరికట్టేందుకు బాగ పనిచేస్తుంది.

మందు వేసవి కాలంలో నిమ్మ షర్బత్ వేసవి పానీయంగ వాడుట మనకంద రికీ విదితమే. బాగ ఉష్ణము చేసినపుడు నిమ్మరసంలో పంచదార వేసుకుని, నీరు కలిపి త్రాగిన బాగ తగ్గిపోవును. అలాగే మలబద్ధకానికి పరగడుపున గోరువెచ్చని నీటిలో నిమ్మరసం పిండి తీసుకున్న మంచిది.

ఇంతేకాక ఇది సౌందర్య పోషణను పెంచుతుంది. చర్మవ్యాధులకు, చర్మ సౌందర్యానికి మేలు. రసం పిండిన పిమ్మట ఆ డిప్పలతో ముఖానికి రాసుకున్న చర్మము నునుపుగ, తాజాగ వుండును. అందువలనే కొన్ని సోపులలో ఇది వాడట మైనది. 'లిరిల్' సోపు అడ్వర్‌టైజ్‌మెంట్ మీరు విని వుంటారు, చూచి వుంటారు. కానీ కృత్రిమంగా తయారైన వీనికంటె తాజా నిమ్మకాయ వాడుట ఎంతో శ్రేష్ఠం.

నిమ్మ ఆకులలో, కాయపైన వున్న తోలులో తైల గ్రంధులుండుటవలన మనకు నిమ్మనూనె (సిట్రస్ నూనె) లభించును. ఇది గాలి తగిలిన హరించిపోవును. ఈ నూనెను సబ్బులలోను, మందులలోను వాడెదరు.

నిమ్మరసం బట్టలమీద మరకలను పోగొట్టుటలో చెప్పుకోతగ్గది. కానీ ఎప్పుడైన నిమ్మరసం తీయునపుడు మాత్రం సిమెంటు గచ్చుమీదకాని, పాలిష్ బండలమీదకాని పడనీక జాగ్రత్త వహించడం మరువవద్దు. (తెల్లగ మచ్చ ఏర్పడును)

నిమ్మకాయ ఊరగాయ, పచ్చడి, మనము నిత్యము వాడుతుంటాం. పైత్యానికి చాల మంచిది. అన్నిటా మేలుచేసే నిమ్మకాయలను ఎప్పుడూ ఇంటిలో వుంచు కోవడం ఇల్లాలి కర్తవ్యము. ○○

# వీరిని గురించి తెలుసుకోండి

## జానశ్రుతి

జానశ్రుతి జనశ్రుతి అను మహారాజు యొక్క పుత్రుడు. అతడు అనేక దానధర్మములను చేయుచు సత్ప్రవర్తన కలిగియుండెను. అతనికి భగవంతుని గురించి తెలుసుకొనవలెనను తీవ్ర ఆకాంక్ష జనించినది. జానశ్రుతి యొక్క అభిలాషను గుర్తెరిగిన ఋషులు తమలో ఇట్లు తలంచిరి–"ఈ రాజు మనకెంతో సహాయము చేయుచు పోషించుచున్నాడు. కావున ఇతనికి ప్రత్యుపకారము చేయవలసియున్నది"

ఒకనాడు ఆ ఋషులు రాజహంసలై రాజసౌధము యొక్క పైభాగమున నిదురబోవుచున్న జానశ్రుతి సమీపమునకు వచ్చి తమలో ఈ ప్రకారముగ సంబాషించుకొనసాగిరి.

ఒక రాజహంస–"ఓ భిల్లాక్షా! ఈ రాజు యొక్క కీర్తి, తేజస్సు స్వర్గము వరకు వ్యాపించియున్నది."


రెండవ రాజహంస : "ఏమి! బండిక్రింద తపస్సు చేసుకొనుచున్న రైక్వ ఋషికంటె గొప్ప మాహాత్మ్యము ఈ రాజునకు గలదా?"

వారి మాటలను విని రాజు మరునాడు తన సేవకులను పంపి రైక్వ ఋషి ఉన్న ప్రాంతమును తెలుసుకొనెను.

పిమ్మట జానశ్రుతి రాజు వేయి గోవులను, రాకుమార్తెను, విశేష ధన సమూహములను రైక్వ ఋషికి సమర్పించెను. ఆ ఋషి రాజు యొక్క ఆధ్యాత్మిక జిజ్ఞాసను గుర్తెరిగి, బ్రహ్మవిద్యను గ్రహించుటకు రాజు అర్హుడని తలంచి, ఆతనికి బ్రహ్మజ్ఞానమును ఉపదేశించెను.

(బ్రహ్మవిద్య విద్యలన్నిటిలోను చాల గొప్పది. బ్రహ్మవిద్యను బడసినవారు పరమశాంతిని, జన్మరాహిత్యమును పొందగలరు. కావున అనుభవజ్ఞుడైన సద్గురువును వెతకికొని ఆతనివలన బ్రహ్మవిద్యను బడసి జీవుడు తరించవలెను. స్వస్వరూపానుభూతియే జీవితలక్ష్యము. అద్దానిని బడసి జీవుడు జన్మసాఫల్యమును పొందవలెను.)

OO



*ఆగ్నేయశ్చైవ స్కన్దశ్చ దీప్తకీర్తి రనామయః॥*
*మయూర కేతుర్ధర్మాత్మా భూతేశో మహిషార్దనః॥*
*కామజిత్ కామదః కాన్తః సత్యవాగ్ భువనేశ్వరః॥*
*శిశుః శీఘ్రః శుచిశ్చణ్డో దీప్తవర్ణః శుభాననః॥*
*అమోఘస్త్వనఘో రౌద్రః ప్రియశ్చన్ద్రాననస్తథా।*
*దీప్తశక్తిః ప్రశాన్తాత్మా భద్రకృత్ కూటమోహనః॥*
*షష్ఠీప్రియశ్చ ధర్మాత్మా పవిత్రో మాతృవత్సలః॥*
*కన్యాభర్తా విభక్తశ్చ స్వాహేయో రేవతీసుతః॥*
*ప్రభుర్నేతా విశాఖశ్చ నైగమేయః సుదుశ్చరః॥*
*సువ్రతో లలితశ్చైవ బాలక్రీడనకప్రియః॥*
*ఖచారీ బ్రహ్మచారీ చ శూరః శరవణోద్భవః॥*
*విశ్వామిత్ర ప్రియశ్చైవ దేవసేనాప్రియస్తథా।*
*వాసుదేవ ప్రియశ్చైవ ప్రియః ప్రియకృదేవ తు।*
*నామాన్యేతాని దివ్యాని కార్తికేయస్య యః పఠేత్।*
*స్వర్గం కీర్తిం ధనం చైవ స లభేన్నాత్ర సంశయః॥* 7

ఆగ్నేయ, స్కంద, దీపకీర్తి, అనామయ, మయూరకేతు, ధర్మాత్మా, భూతేశ, మహిషమర్దన, కామజిత్, కామద, కాన్త, సత్యవాక్, భువనేశ్వర, శిశు, శీఘ్ర, శుచి, చండ, దీప్తవర్ణ, ప్రశాన్తాత్మా, భద్రకృత్, కూటమోహన, షష్ఠీప్రియ, ధర్మాత్మా, పవిత్ర, మాతృవత్సల, కన్యాభర్తా, విభక్త, స్వాహేయ, రేవతీసుత, ప్రభు, నేతా, విశాఖ, నైగమేయ, సుదుశ్చర, సువ్రత, లలిత, బాలక్రీడనకప్రియ, ఆకాశచారీ, బ్రహ్మచారీ, శూర, శరవణోద్భవ, విశ్వామిత్రప్రియ, దేవసేనాప్రియ, వాసుదేవప్రియ, ప్రియ, ప్రియకృత్-అను నివి కార్తికేయుని దివ్యనామములు. ఎవడు వీనిని పఠించునో, అతడు ధనమును, కీర్తిని, స్వర్గలోకమును పొందును. ఇందు సంశయములేదు.

○○

# మహాత్ముల ప్రబోధము

## శ్రీ రామతీర్థస్వామి

ఓంకారమును ఉచ్చరింపుము. అట్లు ఉచ్చరించుచు నీ మనస్సను సరోవరమందు పరిశోధనను ప్రారంభించుము. ఆ మనస్సరోవరమున బహుముఖములు గల మాయా విషసర్పమును గూర్చి వెతకుము. అంతులేని కోరికలు, ప్రాపంచిక సంస్కారములు, స్వార్థభావములు మున్నగునవియే ఆ విషసర్పముయొక్క తలలు, నాలుకలు, కోరలు. వానినన్నింటిని ఒక్కొక్కటిగ పెరికిపారవేయుము. త్రొక్కివేయుము. జయింపుము, నాశమొనర్చుము. ఓంకారమును ఉచ్చరించుచు ఈ ప్రకారముగ మాయాసర్పమును ఛేదించివేయుము.

2. అజ్ఞానముచే 'నేను దేహము' అని నీవు అనుకొనుచున్నావు. కాని వాస్తవముగ నీవు దేహము కాదు. అనంతశక్తియే నీవు. దైవస్వరూపమే నీవు. శాశ్వత అవిచ్ఛిన్న, నిర్వికార చిదాత్మయే నీవు. ఈ సత్యమును తెలిసికొనివచో విశ్వమంతటను నీవే వ్యాపించియున్నట్లు యెఱుగ గలవు.


3. నీ యందుగల పరమాత్మను సాక్షాత్కరించుకొనుము. వెంటనే నీ కోరికలన్నియు ఫలించగలవు. నీ దుఃఖమంతయు అంతరించిపో గలదు. నీ క్లేశములన్నియు సంపూర్ణముగ సమసిపోగలవు. OO

---

Pay as much attention to the means of work as to its end.

లక్ష్యమును గూర్చి ఎంత శ్రద్ధ వహింతువో లక్ష్యసాధన యెడల కూడ అంత శ్రద్ధ వహింపుము.

---

# ఆధ్యాత్మిక  కథలు

## చెఱపకురా చెడెదవు

**ఒ**కానొక గ్రామమునందు ఒక బీదరైతు నివసించుచుండెను. అతడు తనకుగల కొద్దిపాటి నేలను కష్టపడి దున్నుకొనుచు పంట పండించుకొనుచుండెను. పండిన ధాన్యమును దగ్గరలో ఉన్న పట్టణమునకు తీసుకొనిపోయి అచట దానిని అమ్ముచుండెడివాడు. ఆ వచ్చిన పైకముతో తన కుటుంబమును పోషించుకొనుచు అతడు కాలము గడుపసాగెను.

ఒక పర్యాయము అతడు తన పొలములో వరిపంట పండించెను. ఆ ధాన్యమునంతటిని అతడు 50 సంచులలో నింపియుంచెను. ఆ సమయమునందు పట్టణములో ధాన్యమును కొనుటకు ఎవరును ముందుకు రానందున ఆ ధాన్యపు బస్తాలన్నిటిని ప్రక్క గ్రామములో గల ఒక భూస్వామివద్ద నిలువచేయుటకు నిశ్చయించెను. ఆ బస్తాలను భూస్వామి యొక్క ధాన్యాగారములో (Godown) భద్రపరచుటకుగాను ఆ రైతు అద్దె పైకమును అతనికి నెల నెలా చెల్లించుచుండెను.

కొన్ని నెలలు అయిన పిదప పట్టణములో వరిధాన్యమునకు గిరాకీ ఏర్పడినది. మార్కెట్టునందు ధాన్యము అధిక ధరలో అమ్ముడుపోసాగెను. ఆ విషయమెఱిగి భూస్వామికి దురాశ కలిగెను. ఆ బీదరైతు తనవద్ద దాచిన 50బస్తాలను పట్టణములో విక్రయించి అధిక లాభమును పొందవలెనని ఆ భూస్వామి తలంచెను. ఆ బీదరైతుకు తెలియకుండ అతడు 50 ధాన్యపు బస్తాలను అధిక ధరలకు అమ్మివేసి, ఏమీ ఎఱుగనట్లు ఉండసాగెను.

పట్టణములో వరిధాన్యమునకు సరియైన ధరలు ఏర్పాటుచేయబడి యుండుటను గమనించిన బీదరైతు ఆ భూస్వామి కడకు వెళ్ళి తన 50 ధాన్యపు బస్తాలను తనకు తిరిగి ఇవ్వవలసినదిగా కోరెను. అపుడా

భూస్వామి–"నీవు ఎవరివద్ద నీ ధాన్యపు బస్తాలను దాచితివి? నావద్ద నీవు వేటిని కూడ దాచలేదు. మతిభ్రమించి మాట్లాడుచుంటివా! ఏమి? పొమ్ము పొమ్ము" అని కోపముతో బదులుపలికెను. ఆ మాటలు విని దిగ్భ్రాంతినొందిన రైతు, భూస్వామివద్ద 50 ధాన్యపు బస్తాలను నిలువచేసి నట్లు, వాటిని తనకు ఒప్పగించవలసినదిగా బ్రతిమాలుకొనెను. ఐనను భూస్వామి ఏమాత్రము జంకక ఆ బీదరైతును పంపివేసెను. పాపము, ఆ రైతు చేయునదేమియు లేక న్యాయస్థానమునందు దావా వేసెను.

మరునాడు కోర్టువారు భూస్వామిని, రైతును పిలిపించి న్యాయ విచారణ ప్రారంభించిరి.

న్యాయాధిపతి : ఓ భూస్వామీ! ఆ బీదరైతు నీవద్ద 50 ధాన్యపు బస్తాలను ఉంచిన సంగతి నిజమేనా?

భూస్వామి : ఆ బీదరైతు నావద్ద ఒక్క ధాన్యపు బస్తా కూడ నిలువ చేయలేదు.

న్యాయాధిపతి : ఆ రైతు మిక్కిలి బీదవాడు. దయ యుంచి కనీసము ఆ ఖాళీ సంచులనయినా అతనికి తిరిగి ఇచ్చివేయుము. నీ మేలును అతడు ఎన్నడు మరువడు.

"అట్లాగే ఇచ్చెదను" అని పలికి భూస్వామి 50 ఖాళీ సంచులను ఆ బీదరైతుకు ఒప్పగించెను. వెంటనే న్యాయాధిపతి భూస్వామి యొక్క దుర్బుద్ధిని గుర్తెరిగి, అతనికి కారాగార శిక్షను విధింపజేయుటయేకాక అతని ద్వారా బీదరైతుకు నష్టపరిహారమును ఇప్పించెను. తనకు న్యాయము జరిగినందులకు ఆ బీదరైతు ఎంతయో సంతోషించి వెడలిపోయెను.

నీతి : ఎవరిని మోసగింపరాదు. ఇతరులను మోసగించినచో తనను తానే మోసగించుకొనినట్లగును. భగవంతుడు హృదయమునందే నివసించుచు జనులు చేయు కార్యములన్నింటిని సాక్షిగ గమనించుచున్నారు. కావున మానవుడు దుష్టకార్యములను, దుష్టతలంపులను దరికి చేరనివ్వక, సద్భావములనే, సద్బుద్ధినే అలవరచుకొని సదాచారపరాయణుడై చిత్త శుద్ధిని, దైవానుగ్రహమును బడసి కృతకృత్యుడు కావలెను. ○○

# పర[illegible]దేశములు

## శ్రీ రామకృష్ణ పరమహంస ఇట్లు చెప్పిరి–

ఒక పాత్రను నీటిలో వుంచినపుడు దానిలోపల, వెలుపల, క్రింద, పైన కూడ నీరు వుండును. ఆ విధముగనే ఆత్మజ్ఞానమును బడసినవాడు, తన లోపల, వెలుపల, బ్రహ్మాండము అంతటను భగవానుడు వ్యాపించియున్నట్లు అనుభవము నొందును. సాధకుడు ప్రారంభములో బయటగల దైవవిగ్రహములందు భగవంతుని దర్శించును. భక్తిశ్రద్ధలతో అతడు సాధనను అభ్యసించుచున్నచో హృదయ మందును, విశ్వమంతటను దైవము వ్యాపించియున్నట్లు తెలుసుకొని పరమా నందమును అనుభవించును.

జీవించియున్నపుడే (ఆయుర్దాయము పూర్తికాకమునుపే) కామక్రోధాది అంతశ్శత్రువులను నిర్మూలించినవాడు జన్మసార్థకతను, పరమశాంతిని పొందును. మానవుడు బాల్య యవ్వనములందే తన జీవిత గమ్యమును తెలుసుకొనవలెను. బాగుగ విచారించి ప్రపంచము యొక్క, శరీరము యొక్క అశాశ్వతత్వమును గుర్తెరుగవలెను. అత్తరి మనస్సునందుగల దుష్టవాసనలను, కోరికలను తొలగించు కొనుటకు ధర్మకార్యాచరణ, దైవసేవ, గురుసేవ, ధ్యానము మున్నగు సాధనలను ఆచరించవలెను. అభ్యాసవశమున అతని హృదయము నిర్మలమగును. నిర్మల మనస్సు నందు ఆత్మజ్ఞానోదయము కలుగును. జ్ఞానము వలన స్వస్వరూపాను భూతిని బడసి మానవుడు తన జన్మను చరితార్థము చేసుకొనును.

3. కుండ తయారగుటకు మట్టి, నీరు రెండును అవసరములైయున్నవి. ఆ విధము గనే జ్ఞానము, శక్తి ఈ రెండును ప్రపంచ సృష్టికి ఆవశ్యకములు. భగవానుడు జ్ఞానము, శక్తి కలిగియుండి సృష్టిరచనను గావించుచున్నారు.

4 త్యాగమువలననే మనుజునకు అమృతత్వము, మోక్షము లభించుచున్నది. ముముక్షువు తన సంపదలందు, బంధువులందు ఆసక్తిని విడనాడవలెను. మహాత్ముల సేవను గావించుచు తన యందలి దేహాహంభావమును, మహత్వమును నిర్మూలించుకొనవలెను. అహంకారమును వదలిన వానికే సర్వత్యాగము సిద్ధించును. అత్తరి అతడు భగవంతునియందు, ఆనంద సాగరమందు లీనమై పోవును.

○○

## సీరియల్

# జనమేజయ మహారాజు – 4

### ఈశ్వర్

తన తండ్రియగు పరీక్షిన్మహారాజుకు జరిగిన మరణ వృత్తాంతమంతయూ మహామంత్రి ద్వారా వినిన జనమేజయ మహారాజు మనస్సుకు చిరాకు కలిగెను. "నా తండ్రికి అకాలమృత్యువును కలిగించిన తక్షకుని, అతనికి సహకరించిన నాగులను నిలువునా కాల్చి భస్మం చేయనిదే నాకు మనశ్శాంతి వుండదు. మహామంత్రీ వెంటనే నాగలోకం మీదికి యుద్ధం ప్రకటించండి" అన్నాడు జనమేజయ మహారాజు.

[illegible]

"మహారాజా! అట్టి అవసరం లేకుండానే చతుర్దశభువనాల్లో వున్న సర్పాలన్నీ మీవద్దకే వచ్చి చచ్చిపోయే సులభమైన పద్ధతొకటుంది" అన్నాడు. "ఏమిటో ఆ పద్ధతి త్వరగా సెలవివ్వండి" అన్నాడు జనమేజయ మహారాజు. **'సర్పయాగం చేయండి'** ఆ మహాయజ్ఞం చేస్తే శత్రుభంజనం, మిత్రరంజనం కలుగుతాయి" "అయితే అట్టి యజ్ఞం ఎలా, ఏ విధంగా చేయాలో మీరే దగ్గరుండి చేయించండి" అన్నారు రాజు గారు. "మహాభాగ్యం" అన్నాడు ఉదంకుడు.

### యజ్ఞమండపం

హస్తినాపురి వెలుపల విశాలమైన మైదానములో పురప్రజలు క్రిక్కిరిసిపోయారు. దేశదేశాలనుంచి మిత్రులు, బంధువులు అనేకులు వచ్చి చేరారు. మరియు మునులు, మునీశ్వరులు ఎందరో ఏతెంచిరి. జనమేజయ మహారాజు తన అర్ధాంగియగు వపుష్టాదేవితో కలిసి యజ్ఞదీక్షను వహించిరి. ఋత్వికులందరూ ఆసీనులై మంత్రములు

పఠింపుచుండిరి. ఆ మంత్రము కాలపాశాలై సర్పజాతులను లాక్కొని రావడం ప్రారంభించాయి. తెల్లటి పాములు కొన్ని, ఎర్రటి పాములు కొన్ని, పచ్చవి కొన్ని, నల్లటివి కొన్ని, రెండు శిరస్సులు, ఐదు శిరస్సులు గలిగినవి కొన్ని రకరకాలుగా వింతైన పాములు ఆక్రందన చేస్తూ యజ్ఞగుండంలోని అగ్నిజ్వాలలోపడి ప్రాణాలు విడిచిపెట్టసాగాయి. విషపూరితమైన సర్పశరీరాలు అగ్నిలో కమిలి పగిలిపోతూంటే దుర్గంధం ధూమంతో కలిసి ఆ ప్రాంతమంతా వ్యాపించింది. పాముల శరీరాలు పగిలే శబ్దాలు భయంకరంగా మారుమ్రోగసాగాయి. ఇలా సాగిన సర్పయాగంలో చాలా వరకు సర్పములన్నియు బూడిదయిపోయాయి.

## తక్షకుని వంతు

చివరగా తక్షకుని వంతు వచ్చింది. తక్షకుడు భయపడి ఇంద్రుని శరణు పొందాడు. అయినా మంత్రప్రభావము ముందు తక్షకుని యుక్తులు ఫలించలేదు. మంత్రాలు బంధించుకొని ఈడ్చుకొని రాసాగాయి. తక్షకుని నోటినుండి వెలువడే విషాగ్ని జ్వాలలకు ఆకాశమంతా ఎర్రబడిందా అనిపించింది.

ఆకస్మికముగా ఒక బ్రాహ్మణుడు యజ్ఞశాలకేతెంచాడు. "స్వామీ! తమ రాకతో యజ్ఞము పూర్ణత్వము పొందినది. తమ రాకకు కారణము సెలవివ్వండి. తమరు ఆజ్ఞాపించండి" అన్నాడు జనమేజయుడు.

"రాజా! ఇప్పటికే చాలావరకు సర్పములు తమ యజ్ఞములో ఆహుతి అయినవి. ఇక చాలు సర్పయాగము విరమించండి" అన్నాడు ఆ బ్రాహ్మణుడు. "అలాగే" అన్నాడు జనమేజయుడు. అదే సమయంలో ఆకాశమంతా వినిపించేంత శబ్దముతో బుసలుకొడుతూ పరిసరాలను భయంకరంగా చేస్తూ మంత్రపాశాలు పట్టి లాగుతూంటే గిరగిరా తిరుగుతూ యజ్ఞగుండములో పడబోతున్న తక్షకుడు అందరికి కనిపించాడు.

ఆ చివరి క్షణంలో "ఆగు తక్షకా! ఆగు. కరుణామూర్తియగు జనమేజయ మహారాజు నిన్ను క్షమించి రక్షించాడు. వెళ్ళిపో" అన్నాడు. ఆ బ్రాహ్మణుని ఆ వాక్కు తక్షకుని వెనక్కి మళ్ళించింది.

ఆ మరుక్షణం సర్పయాగమునకు శాంతివచనములు పలికారు.

ఇంతటి మహత్తరమయిన సర్పయాగమును విరమింపచేసి తక్షకుని కాపాడిన ఆ బ్రాహ్మణుని పేరు ఆస్తీకుడు. ఇతని పేరు తలంచినంతనే పాము విషము

హరించునని పెద్దలు చెప్పుచుందురు.

ఈ క్రింది మంత్రమును పఠించుటద్వారా పాము విషమునుండి ఉపశమనము పొందవచ్చునని నమ్ముచుందురు.

## పాము మంత్రము

*1. యో జరత్కారుణా జాతో జరత్కారౌ మహాయశాః*
*ఆస్తీకః సర్పసత్రే వః పన్నగాన్ యోఽభ్యరక్షత*
*తం స్మరన్తం మహాభాగా న మాం హింసితు మర్హథ*

*2. సర్పాపసర్ప భద్రం తే గచ్ఛ సర్ప మహావిష*
*జనమేజయస్య యజ్ఞాన్తే ఆస్తీకవచనం స్మర*

*3. ఆస్తీకస్య వచః శ్రుత్వా యః సర్పో న నివర్తతే*
*శతధా భిద్యతే మూర్ధ్ని శింశవృక్షఫలం యథా*

1. తా॥ జరత్కారుడను ఋషివలన జరత్కారు అను నాగకన్యకు జనించిన ఆస్తీకుడను ఋషి సర్పయాగమున సర్పములను రక్షించెను. అతనిని నేను స్మరించుచున్నాను. మహాభాగ్యశీలురగు సర్పములారా! మీరు నన్ను కఱువకుడు.


2. మహావిషధరులగు ఓ సర్పములారా! మీరు పారిపొండు. మీకు శుభమగుగాక! జనమేజయుని యజ్ఞము యొక్క సమాప్తి సమయమున ఆస్తీకునకు మీరు చెప్పిన వాక్యములను స్మరింపుడు.

3. ఆస్తీకునకు చెప్పిన శపథ వాక్యములను వినియు ఏ సర్పము వెడలిపోదో, దాని శిరస్సు శింశవృక్షఫలమువలె వందలకొలది ముక్కలైపోవును.

("జనమేజయ వృత్తాంతము" –పీరియడ్ క్లాసుతో సమాప్తము.)

Spiritual development does not germinate the seed sown in the soil of earthly pleasures.

**ప్రాపంచిక సుఖములనుబట్టి నేలలో వేసిన విత్తనము నుండి ఆధ్యాత్మికోన్నతి అను మొలక ఎన్నడును విజృంభింపనేరదు.**



## శ్రీ కోకా శారద గారు M.A., Ph.D. (కర్నూలు)

**హిం**దువుల పండుగలలోకెల్లా పెద్దది, పెద్దలది అయిన సంక్రాంతి సూర్యగమనాన్నిబట్టి ఏర్పడుతుంది. ప్రతి సంవత్సరం పుష్యమాసం రెండవ వారాంతంలో సంక్రాంతి పండుగ వస్తుంది.

'సంక్రాంతి' అంటే సూర్యాది గ్రహరాశుల అంతరగమనం అని చెప్పబడింది. సూర్యుడు ఒక రాశి నుండి మరో రాశిలోకి ప్రవేశించడాన్ని 'సంక్రమణం' అంటారు. ఈ సూర్య సంక్రమణం ప్రతి నెలా జరుగుతుంది. కానీ పుష్యమాసంలో జరిగే మకర సంక్రమణానికే అధిక ప్రాధాన్యం ఉంది. అదే సంక్రాంతిగా ప్రసిద్ధిచెందింది.

సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించినపుడు మకర సంక్రాంతి వస్తుంది. 'మకరం' అంటే మొసలి. అది పట్టుకుంటే వదలదు. మానవుడికి 'మోహం' అనేది మొసలిలా పట్టుకుని వదలక అతని ఆధ్యాత్మిక మార్గానికి అడ్డుతగిలి అతన్ని మోక్షానికి అనర్హుడ్ని చేస్తుంది. ఆ మోహాన్నుంచి తప్పించుకోవడానికి ఈ మకర సంక్రమణ కాలంలో విరివిగా పూజలు, దానధర్మాలు చేస్తారు.

సంక్రాంతి నాలుగు రోజుల పండుగ. మొదటి రోజు భోగి, రెండో రోజు మకర సంక్రాంతి, మూడో రోజు కనుమ, నాలుగో రోజు ముక్కనుమ. చాలా ప్రాంతాల్లో సంక్రాంతి మూణ్నాళ్ళ ముచ్చటైన పండుగ. కానీ కొన్ని ప్రాంతాల్లో ముక్కనుమ కూడా గొప్పగా జరుపుకుంటారు.

"సంక్రాంతౌ నిమిత్తే విహితస్య స్నానదానదేః
నిషిద్ధస్య వాధ్యయనాదేః పాలనం భోగః"

అని హేమాద్రి పండితుడు భోగిని గూర్చి తెలిపాడు. భోగినాడు ఉదయాన్నే

భోగిమంటలు వేసుకుని అశుభం విరగడ చేసుకుని భోగిస్నానాలు చేస్తారు. పొంగలి భుజిస్తారు. భోగిపండుగ ఇంద్రుని ప్రీత్యర్థం చేసేదని కొందరి అభిప్రాయం. అందుకే ఈనాడు చేసే పొంగలిని 'ఇంద్రుని పొంగలి' అంటారు. భోగినాటి సాయంత్రం భోగిపళ్ళ పేరంటాలతో సందడిగా పండుగ జరుపుకుంటారు.

సంక్రాంతి పండుగ ఇంతటి విశిష్టతను పొందడానికి ముఖ్య కారణం ఈ పండుగ ఉత్తరాయణ పుణ్యకాలంలో రావడమే. ఉత్తరాయణం దేవతలకు ముఖ్యమైంది. మకర సంక్రాంతినుండి అంటే సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన రోజు నుండి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది.

దేవతలకు దక్షిణాయనం రాత్రికాలమని, ఉత్తరాయణం పగటి కాలమనీ అందులో ధనుర్మాసం ఉషఃకాలమనీ చెప్పబడింది.

అని భగవద్గీత వచనం. అగ్ని, జ్యోతి, పగలు, శుక్లపక్షం, ఆరు నెలలుగల ఉత్తరాయణ మార్గం శుక్లమార్గమనబడుతుంది. ఆ మార్గాన పోయిన బ్రహ్మవేత్తలు పరబ్రహ్మాన్ని అంటే ముక్తిని పొందుతారని చెప్పడంవల్ల ఉత్తరాయణం పుణ్యకాలమని, మోక్షప్రదమని తెలుస్తుంది.

పాపం ముక్తోభవేత్ సద్యః రవిర్యాత్యుత్తరాయణే"

అని శాస్త్రవచనం. దక్షిణాయనంలో ఉన్న సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించగానే మానవులంతవరకు చేసిన పాపాలు తొలగిపోతాయని చెప్పబడింది.

ఉత్తరాయణ పుణ్యకాలంలో మరణించినవారు స్వర్గాన్ని చేరుకుంటారని నమ్మకం. అందుకే భారత వీరుడైన భీష్ముడు ఉత్తరాయణంవరకు వేచి ప్రాణాలు వదిలాడు.

"ఉత్తరాయణమును సంగరోత్సవాది
కారణంబులుఁగలుగు సత్కర్మపరుని
మరణమునకు..."

అనే భారతవచనంవల్లి సత్కర్మపరునికి ఉత్తరాయణంలాంటి సమయాల్లో మరణం కలుగుతుందని తెలుస్తుంది. ఇంతటి విశిష్టతగల ఉత్తరాయణ ఆరంభంలో

జరుపబడ్డంవల్ల మకరసంక్రాంతి విశేష ప్రసిద్ధి పొందింది.

సూర్యగమనాన్నిబట్టి ఏర్పడే పండుగ కాబట్టి ఈనాడు సూర్యారాధనం చేస్తారు. సకల జీవకోటికి ప్రాణాధారమైన సూర్యుని-

"మంగళం సూర్యదేవాయ మంగళం పద్మబాంధవే
మంగళం పద్మినీశాయః భాస్కరాయాస్తు మంగళం"

అని ఎన్నో స్తుతులతో పూజిస్తారు. క్రొత్తగా పండిన ధాన్యంతో పొంగలి వండి సూర్యునికి నివేదిస్తారు.

సంక్రాంతి పండుగ ముగ్గుల్లో సూర్యరథం ముగ్గు వేయడం కూడా ఒక ఆచారం. అంతేకాక సూర్యకిరణాలు పితృదేవతల ఆత్మలకు ప్రతీక కనుక సూర్యారాధన పితృదేవతోపాసనకు సమానమనే అభిప్రాయం కూడా ఉంది. అందువల్లనే మకర సంక్రమణ పుణ్యకాలంలో పితృదేవతలకు తర్పణాధికాలు వదలి, పితృపూజలు చేస్తారు.

'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' అన్నట్లు సూర్యారాధన చేస్తే కుష్ఠవ్యాధి నయమవుతుందని పురాణాలవల్ల తెలుస్తుంది. శ్రీకృష్ణుని మనుమడైన సాంబుడు శాపవశాన కుష్ఠవ్యాధి పీడితుడై చంద్రభాగా నదీ తీరంలో సూర్యోపాసనచేసి భాస్కరుని అనుగ్రహంతో ఆరోగ్యవంతుడై కోణార్క ఆలయాన్ని నిర్మింపజేసినట్లు తెలుస్తుంది. మకర సంక్రమణ రోజునే ఆ ఆలయంలో సూర్యభగవానుని ప్రతిష్ఠించినట్లు చెప్పబడుతుంది.

ఇలా సంక్రాంతి ముగ్గుల పండుగ, గొబ్బిళ్ళ పండుగ, భోగిమంటల పండుగ, ధనుర్మాస పండుగేకాక ఆరోగ్యప్రదాత అయిన సూర్యుని పండుగ, పుణ్యప్రదమైన ఉత్తరాయణ కాలపు పండుగ, స్వర్గస్థులైన పితృదేవతల పండుగ అని కూడా చెప్పవచ్చు. ○○

Pleasures are increased
proved by reflection and strengthened by enjoyment.

విషయభోగములు మననము చేసినకొలది వృద్ధియగు చింతించినకొలది దట్టమగును, అనుభవించిన కొలది బలపడును.

(కావున వానిని ఉపేక్షించుటయే శ్రేయః )

# ప్రశ్నోత్తర వేదిక ?



## సందేహాలు – సమాధానాలు

డాక్టర్ ఎస్.బి.రఘునాథాచార్యులు గారు M.A.,Ph.D.

(తిరుపతి)

**ప్రశ్న :** *భగవంతుణ్ణి ఆరాధిస్తే సంసారంలో బాధలు తగ్గి మోక్షం లభిస్తుందని ఎవరు చెప్పారు? దానికైదైనా ప్రమాణమున్నదా?*

**జవాబు :** ఎవరో చెబితే మనమెందుకు వింటాం? సాక్షాత్తు శ్రీకృష్ణపరమాత్మ ఇలా చెబుతున్నాడు. "నీ మనస్సును నాకంకితం చెయ్. అలా చెయ్యకపోతే నాపై అనన్యభక్తితో వుండు. అదీ చేయలేకపోతే నీ శక్తి వంచన లేకుండా నన్నే ఆరాధించు. అందుకు నాకు శక్తి లేదంటే నన్ను శరణాగతి చెయ్. నీ భారాలన్నీ నాకు వదలి నిశ్చింతగా శాంతితో కాలం గడుపు. నీవు తప్పకుండా నన్నే పొందుతావు. ఇది ముమ్మాటికీ సత్యం. నీవు నా భక్తుడవు. కాబట్టి నాకు ప్రియుడవు. నేను ప్రతిజ్ఞ చేసి చెబుతున్నాను. నన్ను నమ్ము" అని శపథం చేసి చెబుతుంటే ఇంకా దానికి ప్రమాణమేం కావాలి. కావలిసింది మనకొక నిశ్చయం. అభ్యాసం.

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోసి మే ॥ (భగవద్గీత 18-65)

**ప్రశ్న :** *మన ధర్మంలో అన్నింటికంటే తేలికైన మోక్షమార్గమేమిటి? దానిలో నడిచే భక్తుని పాపాలన్నీ పోగొట్టి భగవంతుడు మోక్షాన్ని అనుగ్రహిస్తాడా?*

**జవాబు :** మన ధర్మంలో ఉపదేశించబడ్డ కర్మ-జ్ఞాన-భక్తి మార్గాలలో భక్తి మార్గసార భూతమైన శరణాగతి సర్వ సులభమైన మోక్షమార్గం. ఎందువల్లనంటే ప్రతి వాడు ఏది తనకు ధర్మం? ఏది తనకు అధర్మమని నిర్ణయించుకొనే శక్తి గలవాడుగా వుండడు. నిర్ణయించుకోగల్గినా దాన్ని సక్రమంగా ఆచరించడం గా

# సృష్టిలోని విజ్ఞాన - విశేషాలు

1. చంద్రుని పరిమాణము భూమిలో 80వ వంతు మాత్రమే.
2. ఈ ప్రపంచమున జంతువులలో మొత్తము 20 లక్షల రకములు గలవు.
3. దోమలలో 3,000 రకములు కలవు. ఒక వేసవికాలము నుండి ఒక ఆకురాలు కాలము లోపల 15 తరముల దోమలు పుట్టగలవు.
4. 1988–89 సంవత్సరములో భారతదేశములోని రైల్వేలు మొత్తం 30 కోట్ల 20 లక్షల టన్నుల సరుకులు సరఫరా చేసినవి.
5. అమెరికా దేశములో గాజుతో నిర్మింపబడిన జలాంతర్గామి ద్వారా శాస్త్రజ్ఞులు సముద్రములోని వివిధ విశేషములను చూడగలుగుచున్నారు.
6. వాషింగ్టన్‌లోని అమెరికా నౌకా పరిశోధనాలయములో వున్న అణు గడియారం 17 లక్షల సంవత్సరములలో ఒక సెకండును మాత్రమే తప్పుగా చూపగలదు.
7. నయాగరా జలపాతము 162 అడుగుల ఎత్తు నుండి భయంకరమైన శబ్దము చేస్తూ పడుచుండును. అందు ఒక నిముషములో ఒకటిన్నర కోట్ల ఘనపుటడుగుల నీరు ప్రవహించుచుండును. ○○

---

⇨ అంత తేలిక కాదు. కాబట్టి ధర్మాలనన్నింటిని దేవునియందే వదలి ఆయన్నే సర్వ రక్షకుడుగా, మోక్షదాతగా శరణు పొందడం చాలా తేలికైన మార్గం. అంతే కాకుండా దీన్ని బోధించినవాడు కూడా భగవంతుడే. అలా శరణాగతి చేసిన భక్తుణ్ణి అన్ని పాపాల నుంచి విముక్తుణ్ణి చేసి మోక్షాన్ని ప్రసాదించడానికి ఆయన సంసిద్ధంగా వున్నాడు.నీవేమీ దుఃఖపడవద్దంటున్నాడు. మనం అనన్య భక్తితో ఆయన్ను నమ్మి ఫలాపేక్ష లేకుండా శరణాగతి చేయగలిగితే, మన యోగక్షేమాలను ఆయన విచారిస్తాడు. ఇదే మన వేదాంతసారం.

సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ (భగవద్గీత 18-66)

○○

# కాలం విలువైనది

## ఓం ప్రకాష్

"ఏమండీ రాం గారూ ఎక్కడికి వెళుతున్నారు" అని ప్రశ్నించాను సాయంత్రం 5 గంటలకు. "అబ్బే ఏమి లేదండి అలా కాస్త బస్టాండ్ వెళుతున్నాను" అన్నారు. "ఎందుకు" అని ప్రశ్నించాను. "ఏదో టైం పాస్‌కు" అని అంటూ "మీరు వస్తారా?" అన్నారు. "అలాగే" అంటూ రాంతో ఏవో కాలక్షేపం కబుర్లు మాట్లాడుతూ వెళ్ళాను. బస్టాండు వెళ్ళినాము. అక్కడ వేడి వేడి ఫలహారం మా కంటబడినాయి.

రాం గారు అన్నారు "ఏమండీ హోటల్లోకి వెళ్దామా" అని "అలాగే" అన్నాను. ఇరువురము వేడి వేడి ఫలహారం చేసి కాఫీ త్రాగి బిల్లు కట్టడానికి కౌంటర్ వద్దకు వచ్చాము. అంతలోనే రాంగారు "మీరు బిల్లు కట్టకండి నేను మిమ్మల్ని తీసుకు వచ్చానుగా" అని తానే నాలుగు రూపాయల ఐదు పైసలు బిల్లు చెల్లించారు. తర్వాత పాన్ షాపులో చెరొక పాను వేసుకొని అక్కడ రు.1.30 పైసలు బిల్లు కట్టి రెండు సిగరెట్లు చెరొకటి పీల్చుకుంటూ ఇంటి మొహం తిరిగాము.

దారిలో సినిమా థియేటర్ గం.6.20 నిముషములు సాయంత్ర సమయం కావస్తుంది. "ఏమండీ పిక్చర్ (సినిమా) బాగున్నట్టుంది. పేరు కూడ బాగుంది. 'మాయలాడి' చిత్రమట వెళ్దామా" అన్నారు. "అలాగే" అని చిత్రానికి వెళ్ళాం. అక్కడ మాకు ఇద్దరికి చెరో మూడు రూపాయలు మొత్తానికి 9-15 నిముషములకు చిత్రం (ఆట) ముగియగానే ఇంటికొచ్చాను. అలా ఆ రోజు టైం పాసైంది.

మరుసటిరోజు నా వంతు! ఇంకొక రోజు రాంగారి వంతు! ఇలా నెల రోజులకు మూడు వందల రూపాయలు పైన చిల్లర ఖర్చులు కావడం మరియు పది మంది దృష్టిలో తిరుగుబోతుల్లా కన్పించటం!

ఒకనాటి దినమందున ఒక స్వామీజీ శ్రీ మార్కండేయ దేవస్థానానికి నటరాజ భజనమండలి ఆహ్వానాన్ని అందుకొని భక్తిప్రవచనము ప్రసంగించ వచ్చారు. రోజు రోజుకు మితిమీరిన చిల్లరఖర్చులతో సంసార భారాన్ని మోయలేక మదిలో అనుక్షణం మెదిలే హరినామ సంకీర్తనకు బదులు బాకీల స్మరణమే అధికమైంది.

# ఆత్మానుసంధానము

ముముక్షువులు ఈ క్రింద తెలుపబడిన మహోన్నత భావములను నిరంతరము మననము చేయుచుండవలెను.

అహోను వితతాత్మాస్మి న మామ్స్యపృత్మ నాత్మని
కల్పాన్త పవనాధూత వీకార్ణవ ఇవార్ణవే.

*ఆహో! నేనెంత విశాలమైన రూపముగలవాడను! ప్రళయ వాయువుచే ప్రకంపితమగు మహాసముద్రము తన పూర్వపు సముద్ర పరిమాణమున వట్టనట్లు-నేనిపుడు నా పూర్వపు పరిచ్ఛిన్న (జీవ) రూపమున వట్టకున్నాను. సర్వవ్యాపకమైన సచ్చిదానందాత్మ స్వరూపమై నేను వెలయుచున్నాను.*

OO

---

ఆ తరుణములో స్వామివారికి నేనొక ప్రశ్న వేశాను. "స్వామీ! మీరు అలా దీర్ఘాలోచనలో ఎందుకున్నారు?" స్వాములవారన్నారు. "నీవెందుకు బాధ నొంది భారంతో అగుపిస్తున్నావు?" నేనన్నాను "స్వామీ! అనవసరమైన ఖర్చులతో అప్పుల పాలైపోయాను అందుకే బాధతో వున్నాను". అంతలోనే స్వాములవారన్నారు. "చూడు నాయనా! కాలం చాలా విలువైంది అట్టి కాలాన్ని సద్వినియోగం చేసుకొనక అప్పుల పాలైనావు. మరి నేనేమో కాలమింకా కాస్త పొడిగించి (బ్రహ్మ) యుంటే బాగుండును. నేను ఇంకా ఆ ఈశ్వరుని సంకీర్తనం స్మరణ చేయటము మిగిలిపోయినది. కాలమా సన్నమైంది. ఎటు తోయని స్థితిలో ఇలా విచారంగా యున్నాను" అని సెలవిచ్చారు.

వారి అమృత వాక్యాలు విన్న నేను పాత జీవితానికి స్వస్తి చెప్పి మాయలాడి మనసుకు కాస్తంత గడ్డి గరిపించి చిత్రాలకు బదులు పుస్తకాలు తెరిపించి అల్లర చిల్లరగా ఖర్చు చేసిన నేను ఖర్చులు రుచులు మాని నేను కూడ స్వామిలాగున ఎందుకు మహోన్నతమైన శక్తి సంపాదించలేను? అని అనుకొని విజయభేరి మ్రోగించి "వేదాంతభేరినందుకొని ఒక క్షణం ఒక యుగంలా భావించి శ్రీహరిస్మరణ మది తలంచి అన్నిటికన్న భగవన్నామమే మిన్న" అని మదినెంచి ముందుకు సాగిపోతున్నాను. కాలం 'టైంపాస్' కానే కాదు. అది నా 'లైఫ్ మాస్' అని తెలుసుకున్నాను.

OO



# వసిష్ఠవాణి

## యోగవాసిష్ఠసారము

శ్రీ వసిష్ఠ మహర్షి శ్రీరామచంద్రునకు ఇట్లు బోధించిరి-

### ఉత్పత్తి ప్రకరణము

ఓ రామచంద్రా! దృశ్యముయుండుటయే బంధము. దృశ్యము లేక ద్రష్టయైన ఆత్మయందు స్థితి కలిగియుండుటయే మోక్షము. పరమాత్మ యొక్క కేవల మనోమాత్రమే బ్రహ్మదేవుఁడు, ఈ జగత్తు ఆతని సంకల్పమే యగును. కాఁబట్టి మనోరాజ్యమువలె నియ్యది అసత్తే అయి యున్నది. ఈ యుత్పత్తి ప్రకరణ భావము నెఱుఁగుటకై నీవీ చెప్పఁబోవు ఆకాశ జాఖ్యానమును వినుముః

పూర్వము కృతయుగమున ఆకాశజుఁడను పరమ ధార్మికుడు (బ్రహ్మదేవుఁడు) ధ్యాననిమ్నుఁడై ప్రజాహితనిరతుఁడై యుండెను. ఆతఁడు అధికకాలము జీవింపఁగా, మృత్యువాతనిని గ్రసించుటకై సత్యలోకమునకుఁబోవ గొప్పయగ్ని ఆ మృత్యువును గాల్చఁ దొడఁగెను. కాని దానిని భేదించుకొని లోనికిపోయి బ్రహ్మదేవుని తన హస్తములోఁ బట్ట బ్రయత్నించెను. కాని ఈతనిని స్పృశించుటకుగూడ శక్తి లేక యమునివద్దకుఁ బోయి, తానా యాకాశజుని ఏల వధింపజాలకుండెనని ప్రశ్నింప యముఁడు- 'ఆతని కర్మను వెదకుము; కర్మ లేకున్న ఒంటరిగ నీవాతనిని వధింపఁజాలవు' అని చెప్ప, అంతట మృత్యువాతని కర్మకొఱకై ప్రపంచమంతటను వెదకెనుకాని లాభము లేకపోయెను.

అపుడు తిరిగి యమునివద్దకు బోయి యాయుదంతం బాతని కెఱిఁగింప, ఆతఁడిట్లనియె- 'ఆతఁడు కర్మవాసనారహితుడు; పరబ్రహ్మ స్వరూపుఁడు, విజ్ఞానఘనుఁడు, సర్వవ్యాపకుఁడు. కావున నీవాతనిని వధింపజాలవు. అందుచే నీవాప్రయత్నమును విరమించుకొనుము' అన విని మృత్యు వాశ్చర్యమును బొంది సస్థానమున కరిగెను!"

ఓ రామచంద్రా! మనస్సు మొదలుగాగల ఈ దృశ్య జగత్తంతయు పరమాత్మ యందు కల్పింపఁబడినది. ఇది ఎండమావులవలె మిధ్య. పరమాత్మయే సత్యము. సాధుసంగమ సచ్ఛాస్త్రాదుల ద్వారా పురుష ప్రయత్నముచే ఆత్మజ్ఞానము సంపాదింపఁబడ, అద్దానిచే దృశ్య (సంసార) దుఃఖము పూర్ణముగ నశించి జీవన్ముక్తి లభించును. జ్ఞానమే మోక్షసాధనము. పరమాత్మ దేవుడు ఈ శరీరమందే చిన్మాత్ర రూపమున ప్రసిద్ధుఁడై యున్నాడు. ఈ జగత్తు (దృశ్యము) అసలు ఉత్పన్నమే కాలేదు. అట్టి ఈ లేనిదాని మార్జనమందేమి క్లేశము గలదు!

శాస్త్రములన్నింటిలో ఈ (వాసిష్ఠ) మహారామాయణము చాల యుత్తమమైనది. ఇద్దాని మనన విచారణలచే జీవన్ముక్తి తప్పక లభించును. జీవన్ముక్తుఁడు ఆత్మయందు సదా జాగ్రతుడై దృశ్య ప్రపంచమందు సుషుప్తితుల్యుఁడై ఎల్లపుడు నిర్భయుఁడై, నిర్వికారుఁడై, ఆనందమయుఁడై, కార్యయుతుఁడై యున్నను వాస్తవముగ కార్యరహితుడై, సర్వాత్మస్వరూపుడై యుండును. పరమాత్మయొక్క ప్రకాశముచేతనే ఈ జగత్తంతయు ప్రకాశించుచున్నది ప్రళయకాలమున ఆ పరమాత్మ మాత్రమే శేషించి యుండును. ఈ జగత్తు అధిష్ఠానరూపముచే సత్యము; తన (దృశ్య) రూపముచే అసత్యమునై యున్నది.

OO

## దైవప్రాప్తికి ఉపాయము

**కామినీ కాంచనంబుల కాంక్ష వీడి**
**తనువుతోడనె లోకవాసనలు ద్రెంపి**
**హృదయశుద్ధిగ ఎలుగెత్తి ఏడ్చువేని**
**వెంటబడుచుండు లేనిచో కంటబడము.**

దేవుని కొఱకు పరితపించువారికి, దైవదర్శనమునకై తపించిన హృదయ శుద్ధిని అవలంబించువారికి, పరప్రాణిపై దయగలిగి వర్తించువారికి, దైవసాక్షాత్కారమునకై అహర్నిశములు పాటుపడువారికి దేవుడు తప్పక కనిపించును [illegible] కోరినవారికి దైవదర్శనము అవలీలగ సిద్ధించును.

[illegible] వారికి, స్థూలపదార్థ[illegible] శరణ్యములని భావించువారికి అతి సూక్ష్మముగు పరమాత్మ ఎట్లు [illegible]

# వినోదము-వికాసము

# మూడు పువ్వులు, ఆరు కాయలు

జీవితం మూడు పువ్వులు, ఆరు కాయలుగ వర్ధిల్లాలంటే మానవుడు సద్గు ణాలను అలవరచుకోవాలి. దానము, తపస్సు, సత్యము, అహింస మొదలగు ఉదాత్త గుణాలను స్వీకరించాలి. పవిత్ర హృదయం గల అట్టి సద్గుణవంతులు తమ జీవితాన్ని ఆనందమయంగా ఒనర్చుకొంటారు. అంతటా భగవంతుని సందర్శించు మహనీయులు, "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను సత్యమును ఆచరణయందుంచు మహాత్ములు తమ జీవితాలను వసంతాలుగ చేసుకొంటూ సచ్చిదానంద అంభోరాశి యందు ఓలలాడుచూ యుంటారు.

మలిన హృదయుడగు వ్యక్తి జీవితాన్ని ఎన్నడును ఆనందమయంగ ఒనర్చు కోలేడు. అట్టివాడు పుట్టి తల్లి యొక్క యవ్వనమును తగ్గించినవాడే అగును. భూమికి భారభూతుడే యగును. అట్టివానికి ఆత్మదర్శనం ఎన్నటికి కలుగదు మురికి అద్దంలో ముఖము గోచరించదు కదా! కాబట్టి జీవితాన్ని సుఖమయంగ చేసు కొనదలంచువాడు తన హృదయాన్ని చక్కబరచుకోవాలి. పొలంలో కలుపు మొక్క లను పెరికివేసేలాగున తన అంతఃకరణము నుండి కామక్రోధాది అసురగుణాలను తొలగించివేయాలి. వివేకాన్ని ఉపయోగించి ఆయా దుర్గుణాలను ప్రయత్నపూర్వ కంగ బయటకు సాగనంపాలి. మనస్సును నిష్కంటకంగా చేసుకోవాలి. మనస్సుకు చక్కగ బోధించి కుమార్గం నుండి దానిని మళ్ళించి, సవ్యమైన మార్గంలో యుం డాలి. మనస్సును గూర్చి ఈ క్రింది విధంగా సంబోధించాలి–

"ఓ మనస్సా! ఎన్ని జన్మలు ఈ సంసార చక్రమందు పడి వృధా చేసినావు. అమూల్యమైన ఈ మానవ జీవితాన్ని కూడ ఆలాగున వృధా చేస్తే ఎంత ప్రమాదం. అన్ని అనుకూలాలతో కూడిన ఈ మానవజన్మ బహు దుర్లభం కదా! కాబట్టి ఇట్టి సదవకాశం పోగొట్టుకోవటం నీకే మాత్రం తగదు. మహాత్ముల సన్నిధి చేరి వారి ముఖతః అనుభవ వాక్యములను శ్రవణం చేసి వాటిని ఆచరణ యందుంచి తరించు. ☞

# అమృత బిందువులు

క్షాంతితుల్యం తపోనాస్తి సంతోషాన్నసుఖం పరమ్
నాస్తి తృష్ణాసమో వ్యాధిర్న చధర్మో దయాపరః.

| | |
|---|---|
| ఓర్పుకు సమమైన తపస్సు<br>సంతుష్టికి మించిన సుఖము<br>ఆశతో సమానమైన రోగము<br>దయకు మించిన ధర్మము | = లేదు |

అసంతోషః పరం దుఃఖం సంతోషః పరమం సుఖమ్
సుఖార్థీ పురుషస్తస్మాత్సంతుష్టః సతతం భవేత్.

అసంతుష్టి పరమ దుఃఖమును కలుగజేయును. సంతుష్టి పరమానందమును కలుగజేయును. కాబట్టి సుఖమును కోరువాడు సదా సంతృప్తినే కలిగియుండవలెను ○○

---

"విషయభోగాలకు లోబడకు. ఇంద్రియాలను చెడుమార్గంలో పోనీయక అదుపులో పెట్టుకో"

విజ్ఞుడైనవాడు పై విధంగ మనస్సును సంబోధించి దానిని సన్మార్గాన ప్రవర్తింపచేయాలి. పెక్కు ఆధ్యాత్మిక సాధనలను ప్రయత్న పూర్వకంగ చేసి మనస్సుపై, ఇంద్రియాలపై జయాన్ని సాధించి ఆత్మావలోకనం చేసి తరించాలి. ఈ ప్రకారంగ మానవ జీవితాన్ని సార్థకం చేసుకోవాలి. స్వస్వరూప సాక్షాత్కారం పొంది పరమానందమనుభవించాలి. ఇదే జీవిత లక్ష్యం. ఇదే ముక్తికి సోపానం.

దానే తపసి సత్యే చ యస్య
నోచ్చరితం యశః
విద్యాయామర్థలాభే వా
మాతురుచ్చార ఏవ సః

తాత్పర్యము : దానముగాని, తపస్సుగాని, సత్యముగాని, విద్యగాని లేనివారి జీవితము నిరుపయోగము. ○○


# వేదాంతభేరి శాశ్వత చందాదారులు
## (Life Members)


**వేదాంతభేరి మాసపత్రికకు నూతనముగ చేరిన శాశ్వత చందాదారుల పేర్లు :-**

### శాశ్వత చందా రు. 300/-లు

1. శ్రీ పి. వేంకట్రామయ్య గారు - ఆదోని
2. శ్రీ స్వామి బాలానంద గారు - గుంటూరు
3. శ్రీ కె. లక్ష్మీకుమారి గారు - గుంటూరు
4. శ్రీ ఎస్. చంద్రమోహన్ గారు - విజయవాడ
5. శ్రీ పి. వేంకటాచార్యులు గారు - విజయవాడ
6. శ్రీ జి. రామలక్ష్మి గారు - ప్రొద్దుటూరు
7. శ్రీ సి. శివదర్శనమ్ గారు - హైదరాబాద్
8. శ్రీ డా॥ వై. సీతారత్నం గారు - విజయవాడ
9. శ్రీ టి. యోగయ్య నాయుడు గారు - హైదరాబాద్
10. శ్రీ ఎస్. వేంకటకృష్ణారావు గారు - గుంటూరు
11. శ్రీ వి. లక్ష్మీనారాయణ గారు - ఎమ్.ఎమ్. పురం
12. శ్రీ కె. శ్రీనివాస్ గారు - కొల్హాపూర్
13. శ్రీ ఎన్. పట్టాభిరామారావు గారు - హైదరాబాద్
14. శ్రీ పి.బి. విజయ్‌కుమార్ గారు - హైదరాబాద్
15. శ్రీ కె. నాగప్ప & సన్స్ - బెంగుళూరు
16. శ్రీ ఎమ్. యుగంధరాచారి గారు - మఖ్తల్
17. శ్రీ ఎస్.వి. సత్యనారాయణ గారు - విజయనగరం
18. శ్రీ ఎన్. వేంకటేష్ గారు - కాకినాడ
19. శ్రీ వి.వి. సుబ్బారావు గారు - విశాఖ
20. శ్రీ పి. దుర్గానాగేంద్రకుమార్ గారు - విశాఖ
21. శ్రీ పి. సూర్యనారాయణ గారు - యలమంచిలి
22. శ్రీ జి. వైదేహి గారు - హైదరాబాద్

OO






## శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి కార్యక్రమములు

1. తెనాలిలో జనవరి 9 నుండి 11వ తేది వరకు సాధుసమ్మేళనము.
   స్థలము – తాలుకా హైస్కూలు ఆవరణ.
   నిర్వాహకులు – శ్రీ శ్రీ శ్రీ దండి నిర్మలానంద స్వాములవారు, తెనాలి.
2. 56వ గీతా మహోత్సవము

స్థలము – బొంబాయినందలి సెంచరీ మిల్లు ఆవరణ.

తేదీలు – 1993 ఫిబ్రవరి 10 నుండి 18 వరకు.

సమయం – సాయంకాలం 6 గం॥ నుండి 8 గం॥ వరకు.

నిర్వాహకులు – శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి గీతా సమాజము (బొంబాయి)

ప్రత్యేక కార్యక్రమము – శ్రీ స్వామివారి సమాజమునకు బొంబాయిలో పై సమాజమువారు ఒక మందిరము నిర్మించుకొనియున్నారు. ఈ సందర్భములో ఆ మందిర ప్రారంభోత్సవము కూడ శ్రీ స్వాములవారు చేయుదురు.

వివరములకు– శ్రీ దున్న రాములు గారు, వర్లి బి.డి.డి. చాల్ నం–60, రూమ్ నం–22, అభ్యుదయ బ్యాంకు దగ్గర, బొంబాయి–400 018. ఫోన్ : 4920153.

## ప్రత్యేక వార్త

డిశంబర్ 1992

1. "భక్తకన్నప్ప ఉచిత కంటి ఆస్పత్రి ఎప్పుడు ప్రారంభిస్తారు? ఆ కార్యక్రమాలలో పాల్గొనా"లని చాలామంది ఉత్తరములు వ్రాస్తున్నారు.
2. కాళహస్తి వచ్చి కన్నప్ప కంటి ఆస్పత్రిలో పరీక్ష చేయించుకొని చికిత్సపొందాలని అట్టి అవకాశం కొరకు ఎదురుచూస్తున్నామని మరికొందరిద్వారా జవాబులు వస్తున్నవి.

3. అతిత్వరలో ఆస్పత్రి ప్రారంభోత్సవ వార్త మీకందించి అవసరమైనవారికి వైద్య సేవ చేయగలమని తెలియచేయుటకు సంతోషిస్తున్నాము.

4. రెండు ఆపరేషన్ థియేటర్సు
స్టోరు గది
డాక్టరు గది
పురుషుల వార్డు
స్త్రీల వార్డు
పరీక్షా గది
వేచియుండు గది
పెద్ద వరండా
మొదలగు వాటితో సర్వాంగ సుందరంగా ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి అయినది.

5. ఆపరేషన్ సామాగ్రి యావత్తూ సిద్ధపరచడమైనది.

6. రోగులకు కావలసిన పడకలు వగైరా ఏర్పాట్లుకూడా పూర్తయినవి.

7. ప్రారంభోత్సవ శుభ ముహూర్త తేదీని నిర్ణయించి ఆ కార్యక్రమమునకు కావలసిన తుదిమెరుగులు దిద్దుటకు జనవరి నెలలో కమిటీ సమావేశము కానున్నది.

8. రోగులకు ఆపరేషన్
మందులు
కళ్ళజోడు
భోజనాలతోసహా
ఉచితముగా ఏర్పాటు చేయించాలన్న శ్రీ స్వాములవారి అభిలాష లోగడ తెలియచేసియున్నాము.

9. ఇందుకు ఖర్చులు

| | | | |
|---|---|---|---|
| పెద్ద డాక్టర్‌గార్కి | నెలకు | | వేల రూపాయలు |
| క్రిందిస్థాయి డాక్టర్‌కు మరియు పరివారమునకు | నెలకు | 10 | వేల రూపాయలు |
| మందులు, కళ్ళజోడు, ఆపరేషన్, భోజనాలు వగైరా | నెలకు | 25 | వేల రూపాయలు |

ఖర్చులు అంచనా వేసిరి.

10. ఈ విధమైన ఏర్పాట్లకు నెలకు 40 వేలు ఖర్చుకాగలదని ఊహించబడినది.

11. ఇట్టి ఖర్చును శాశ్వతంగా భరించి ఆస్పత్రిని చక్కగా నిర్వహించుటకు 40 లక్షలు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని కమిటీ నిర్ణయించింది.

12. ఇందుకుగాను నేటివరకు జమలు

| | |
|---|---|
| శ్రీ కాళహస్తీశ్వరస్వామి దేవస్థానంవారి – | 4 లక్షలు |
| భక్తుల విరాళములు | 10 లక్షలు |
| మొత్తం జమ | 14 లక్షలు |

13. ఖర్చులు

| | |
|---|---|
| ఆస్పత్రి భవన నిర్మాణం | 7 లక్షలు |
| ఆపరేషన్ సామాగ్రి | 1 లక్ష |
| ఖర్చు మొత్తము | 8 లక్షలు |

| | |
|---|---|
| జమలు – | 14 లక్షలులో |
| ఖర్చు – | 7 లక్షలు పోగా మిగిలిన |
| | 7 లక్షలు బ్యాంక్‌లో ఫిక్సెడ్ డిపాజిట్ చేయబడినది. |

14. ఇట్టి ఉచిత కంటి ఆస్పత్రి నిర్వహణలో పాలుపంచుకొనుట ఒక మహాయజ్ఞములో పాల్గొనినట్లుగా భక్తులు భావించి తమకు తామే తమ తమ శక్తికొలది ఉదారంగా విరాళములు యం.ఓ.ద్వారా/డ్రాఫ్టుద్వారా పంపుచున్నారు, పంపియున్నారు. వారందరికి మా ధన్యవాదాలు. శ్రీకాళహస్తీశ్వరుడు అందరిని అనుగ్రహించుగాక!

15. 365 మందిని శాశ్వత సభ్యులు (Life Members)గ చేర్చుకొని ఆ సభ్యత్వ విరాళములగు రు.11,116/–లను బ్యాంకిలో ఫిక్సెడ్ డిపాజిట్‌చేసి ఆ వచ్చు వడ్డీతో వారు కోరిన తిథియందు సంవత్సరమునకు ఒక రోజు వారి పేరుతో ఆస్పత్రిలో వైద్యసేవ చేయించాలని నిర్ణయించబడినది. ఇప్పటికే చాలామంది వారి వారి జన్మదినోత్సవము రోజున మరికొందరు వారి వారి తల్లిదండ్రుల పేరుతో ఏర్పాటుచేసుకొని యున్నారు.

16. క్రొత్తగా చాలామంది విరాళాలు పంపియున్నారు. పంపుచున్నారు. వారి వివరములు రాబోవు సంచికలో ప్రకటింపబడును.

విరాళాలు పంపవలసిన పేరు–"భక్తకన్నప్ప ఉచిత కంటి ఆస్పత్రి"

పోస్టల్ అడ్రసు :
General Secretary,
BHAKTA KANNAPPA FREE EYE HOSPITAL
Sri Sukabrahmasram (Post)
SRIKALAHASTI-517 640
Chittor District (A.P.)

Printed and Published by **Vemuri Balaram** for Sri Sukabrahma Ashram, Sri Kalahasti Printed at Swati Press Anil Estates Vijayawada
**Editor : B. ESWAR**

# నారద భక్తి సూత్రములు-84

య ఇదం నారదప్రోక్తం శివాను శాసనం విశ్వసితి
శ్రద్ధతే స ప్రేష్ఠ లభతే స ప్రేష్ఠం లభతీ ఇతి.

తా॥ నారదునిచే చెప్పబడినవియు, పరమ మంగళకరములును, శ్రేయోదాయకములును అగు ఈ భక్తి సూత్రములయందు ఎవడు విశ్వాసము కలిగియుండునో, మరియు శ్రద్ధతో వాటిని అనుష్ఠించునో, అట్టివాడు తన ప్రియతముడైన భగవంతుని పొందును. (దైవ సాక్షాత్కారమును బడయును.)

వ్యాఖ్య :- ఈ చివరి సూత్రమునందు ఫలశ్రుతి చెప్పబడినది. నారదుడు ప్రవచించిన ఈ భక్తి ప్రతిపాదకములగు సూత్రములను ఎవడు శ్రద్ధాభక్తులతో నమ్మి ఆచరించునో, అతడు తన ప్రియతముడైన భగవంతుని సాక్షాత్కరించుకొనును.

'స ప్రేష్ఠం లభతే' (అతడు ప్రియతముడైన భగవంతుని పొందును) అని రెండు పర్యాయములు చెప్పుటవలన తప్పక దైవానుభూతిని బడయగలడని తెలిపినట్లైనది. శ్రద్ధ, విశ్వాసము లేనిచో ఏ కార్యమున్ను ప్రపంచమున సాధింపబడదు. కాబట్టి అనుభవపూర్వకములైన మహనీయుల వాక్యములందు జనులు పరమవిశ్వాసము కలిగియుండి, శ్రద్ధతో వాటిని కార్యాన్వితమొనర్చి దైవ ప్రాప్తిని, తద్వారా దుఃఖరాహిత్యమును, ఆనందప్రాప్తిని పొందవలెను. జీవిత లక్ష్యమిదియేయని తెలిసికొనవలెను.

ఓం

"నారద భక్తి సూత్రములు" అను సీరియల్ సమాప్తము.